# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరానికి చేరుకున్నారు.

❖ పినాక లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

❖ "ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026"ను తెలంగాణలో నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు.

❖ దేశంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరానికి చేరుకున్నారు. మూడు దేశాల అధికారిక పర్యటనలో భాగంగా ఇండోనేషియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ఆయన.. తన పర్యటనలో రెండో విడతగా మెల్‌బోర్న్ చేరుకున్నారు. ప్రధాని మోదీకి ఆ దేశ గృహనిర్మాణ, నగరాల అభివృద్ధి శాఖ మంత్రి క్లేర్ ఓ నీల్ (Clare O'Neill)తో పాటు ఇతర ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ నెల 10వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో ప్రధాని పర్యటించనున్నారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి 3వ "భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సదస్సు"లో పాల్గొంటారు. అక్కడి ప్రవాస భారతీయులతో నరేంద్ర మోదీ సమావేశం కానున్నారు. అనంతరం ఈనెల 10, 11 తేదీల్లో ప్రధానమంత్రి న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో కీలక చర్చలు జరుపుతారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనలో భాగంగా ఈరోజు ఆ దేశంలోని ప్రముఖ యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన "ప్రంబనన్" ఆలయ సముదాయాన్ని సందర్శించారు. ఇండోనేషియా అధ్యక్షుడు

ప్రబోవో సుబియాంతోతో కలిసి ప్రధాని పాల్గొన్నారు. యోగ్యకర్తలోని తొమ్మిదో శతాబ్దానికి చెందిన ఈ ఆలయ సముదాయంలోని ప్రధాన శివాలయాన్ని నరేంద్ర మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో మాట్లాడుతూ.. భారత్, ఇండోనేషియాల మధ్య శతాబ్దాల నాటి ప్రాచీన నాగరికత బంధానికి ప్రంబనన్ ఆలయమే సజీవ సాక్ష్యమని కొనియాడారు. ఆలయ పునరుద్ధరణ, పరిరక్షణ పనుల్లో భారతదేశం అందిస్తున్న సహకారానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆలయ సందర్శన తనకు ఎంతో ఆధ్యాత్మిక, చిరస్మరణీయ అనుభూతిని మిగిల్చిందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 12 శతాబ్దాలుగా ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్న ఇండోనేషియా ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆలయ పరిరక్షణలో భారత్ భాగస్వామ్యం వహించడం ఇరు దేశాల ఉమ్మడి సాంస్కృతిక వారసత్వానికి అద్దం పడుతోందని ప్రధాని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==============================

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన `పినాక లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్` (LRGR)ను ఈరోజు ఒడిశా తీరంలోని చాందీపూర్ సమగ్ర పరీక్షా కేంద్రం (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రయోగించింది. నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదిస్తూ... ఈ రాకెట్ పరీక్ష సాగిందని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పినాక రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

==============================

ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (BIT)తో పాటు `స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం` (FTA)పై సంతకాలు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని భారత్, మాల్దీవులు నిశ్చయించాయి. మాల్దీవుల ఆర్థికాభివృద్ధి, వాణిజ్య శాఖ మంత్రి మొహమ్మద్ సయీద్‌తో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈరోజు న్యూఢిల్లీలో చర్చలు జరిపారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను కేంద్రమంత్రి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. రానున్న రోజుల్లో కుదరబోయే ఈ చారిత్రక ఒప్పందాలు.. ఇరు దేశాల మధ్య పలు కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయని పీయూష్ గోయల్ తెలిపారు.

==============================

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 8.25 శాతం వడ్డీని ఈనెల 15వ తేదీలోగా ఖాతాదారుల అకౌంట్లలో జమ చేయనుంది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 34 కోట్ల ఈపీఎఫ్ ఖాతాల్లో 1.44 లక్షల కోట్ల రూపాయల మొత్తాన్ని జమ చేయనున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. కొత్తగా అందుబాటులోకి తెచ్చిన `సెంట్రలైజ్డ్ ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్` (CITES) వ్యవస్థ ద్వారా ఈ వడ్డీ జమ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విరామం

==============================

దేశ వ్యవసాయ రంగంపై 'ఎల్ నినో' ప్రభావాన్ని అంచనా వేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే ముందస్తు సన్నాహాలు ప్రారంభించిందని వెల్లడించారు. పంటల సాగు, దిగుబడులు, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడానికి ఎల్ నినో మానిటరింగ్ సెల్, క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్‌తో పాటు రాష్ట్ర కంట్రోల్ రూములు, నోడల్ అధికారుల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. తక్కువ నీటితో..

వేగంగా పండే మొక్కజొన్న, సజ్జలు, పెసర్లు వంటి పంటలను సాగు చేయడం వల్ల నష్టాల నుంచి గట్టెక్కవచ్చని శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మనీలాండరింగ్ (అక్రమ ద్రవ్య చలామణి) కేసు దర్యాప్తులో భాగంగా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (AITC)కు వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న 440 కోట్ల రూపాయల డిపాజిట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్తంభింపజేసింది. పార్టీ ఖాతాల ద్వారా జరిగిన అనుమానాస్పద, అక్రమ ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈడీ అధికారులు నిన్న కోల్‌కతాలోని ఐదు ప్రాంతాలలో తనిఖీలు చేపట్టారు. ఈడీ జరిపిన ప్రాథమిక దర్యాప్తులో తృణమూల్ కాంగ్రెస్ అధికారిక బ్యాంక్ ఖాతాల నుండి దాదాపు 160 కోట్ల రూపాయల నిధులు ప్రైవేట్ విమానయాన సంస్థకు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

8వ “ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026”కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈరోజు ప్రకటన చేశారు. దేశవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని పెంపొందించడంలో ఖేలో ఇండియా గేమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని యువ అథ్లెట్లు తమ క్రీడా నైపుణ్యాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ క్రీడలు అద్భుతమైన వేదికగా నిలుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాలు, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 2 శాతానికి పైగా క్షీణించాయి. ముగింపు సమయానికి సెన్సెక్స్ 1,677 పాయింట్లు నష్టపోయి 76 వేల 504 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 517 పాయింట్లు కోల్పోయి 23 వేల 882 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో మిడ్ క్యాప్ 100 సూచీ ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోగా, చిన్న కంపెనీలతో కూడిన స్మాల్ క్యాప్ 100 సూచీ 2.2 శాతానికి పైగా క్షీణించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాలకు `ఆరెంజ్ అలర్ట్` జారీ చేసింది. భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు సంభవించే ముప్పు ఉందని పేర్కొంది. జమ్మూ కాశ్మీర్, లడఖ్, హర్యానా, చండీగఢ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరోవైపు, నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా మరింత వేగంగా విస్తరిస్తున్నాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కువైట్ పర్యటనలో భాగంగా ఆ దేశ క్రౌన్ ప్రిన్స్ షేక్ సబా అల్-ఖాలీద్ అల్-సబాను ఈరోజు కలిశారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంపిన ప్రత్యేక శుభాకాంక్షలను క్రౌన్ ప్రిన్స్‌కు జైశంకర్ అందజేశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను కేంద్రమంత్రి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =